



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్


అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కులగణనపై మాట్లాడలేదు

- వక్ఫ్‌బోర్డు, కులగణన ఘనత ప్రధాని మోదీదే
- బీఆర్ఎస్ విలీనంపై కేసీఆర్‌ను అడగాలి
- ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్

సుభాష్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎప్పుడూ కులగణనపై మాట్లాడలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం కులగణన గుర్తుకు వస్తుందని ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన రాహుల్‌గాంధీ చొరవతోనే అయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారని కాంగ్రెస్ పార్టీ 60 సంవత్సరాల పాటు అధికారంలో ఉందని ముగ్గురు ప్రధాన మంత్రులు రాహుల్ గాంధీ కుటుంబ సభ్యులు ఉన్నారని ఎప్పుడు కులగణన చేయలేదని అన్నారు. కులగణన అనేది రాజకీయ పరికరంగానే చూస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. వీటితో పాటు వక్ఫ్‌బోర్డు, ఒకే దేశం ఒకే ఎన్నికను పార్లమెంట్‌లో చట్టం చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా ట్రిపుల్ తలాక్, జమ్మూకశ్మీర్‌లో 374 ఆర్టికల్‌ను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. రాహుల్ గాంధీ కులగణనకు తెలంగాణ రోల్ మోడల్ అని చెబుతున్నారని జనగణన అనేది కేంద్రం పరిధిలోకి వచ్చే అంశం అన్నారు. రాష్ట్రంలో చేస్తే చెల్లదని అన్నారు. ప్రధాని మోదీ అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ ద్వారా రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. మోదీ మీద అక్కసుతోనే కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ వంత పాడుతున్నారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమేనని సినిమా ఇంకా బాకీ ఉందన్నారు. కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ఎంపీలను ఉగ్రవాదులతో పోల్చడం సరికాదన్నారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీన ప్రక్రియ ఎప్పుడు చర్చకు రాలేదని, విలీనం సంగతి కేసీఆర్‌నే అడగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, స్రవంతిరెడ్డి, ఆమందు విజయ్, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాలతోనే సమస్యల పరష్కారం'

నిజామాబాద్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ సమస్యలను పోరాటాల ద్వారానే సాధించుకోగలరని, అంగన్‌వాడీ ఉద్యోగుల స్ఫూర్తి కార్మికలోకానికి నిదర్శనం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులు పోరాటంతోనే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్‌లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు లక్ష నుంచి 2లక్షలు, హెల్పర్లకు 50వేల నుంచి లక్షకు పెంచుతూ, 60 సంవత్సరాలు దాటిన వారికి వలంటరీ రిటైర్‌మెంట్‌తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సుదీర్ఘకాలం పోరాట ఫలితమే ఇప్పుడు వచ్చిన ఉత్తర్వులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్వర్ణవాణి, జరీనా, సునీత తదితరులు పాల్గొన్నారు.



- జిల్లాలో రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు
- భూసమస్యల పరిష్కారం కోసం సదస్సుల నిర్వహణ
- రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్న అధికారులు
- మండల స్థాయిలోనే భూ సమస్యల పరిష్కారానికి ఏర్పాట్లు

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు

నిజామాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. భూభారతి చట్టం ప్రకారం భూములకు సంబంధించిన సమస్యలపై జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. వాటిని పరిశీలించి మండల స్థాయిలోనే పరిష్కరించనున్నారు. పట్టాదారు పాసుపుస్తకంలో నమోదు చేయనున్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు ఊరట కలిగించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి భూభారతిపై అవగాహన కల్పించిన అధికారులు పూర్తిస్థాయిలో సదస్సులను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ మండలంలో బృందాలను నియమించి గ్రామాల వారీగా ఈ సదస్సులను నిర్వహించనున్నారు. ఇప్పటికే మెండోర మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద సదస్సులు నిర్వహించిన అధికారులు మిగతా 30 మండలాల్లో నిర్వహించేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి

రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల వారీగా సదస్సులను నిర్వహించి పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత చాలా మంది రైతులు చిన్న చిన్న సమస్యలతో ఏళ్ల తరబడి మండల, డివిజన్, కలెక్టరేట్ చుట్టూ తిరిగారు.



పైలెట్ ప్రాజెక్టుగా ఇటీవల మెండోర మండలం కోడిచర్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు



కొంత మంది రాష్ట్రస్థాయి సీసీఎల్ఏ వరకు వెళ్లి ఫిర్యాదులను చేశారు. భూములకు సంబంధించిన విస్తీర్ణం, పేర్ల తప్పులు, నిషేధిత భూములు పడటం, అసైన్డ్‌గా నమోదు కావడం, కాస్తు చేస్తున్న పట్టా లేకపోవడం, ఇతర సమస్యలన్నీ పరిష్కారం కాలేదు. పేరులో చిన్న సరి చేసేందుకు కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమకు సంబంధించిన భూములను విస్తీర్ణం తక్కువగా నమోదు చేయడం వల్ల ఎంతో మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగారు. ధరణిలో సరైన ఆప్షన్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ భూములను వారే కాస్తు చేస్తున్నా పట్టాలో లేకపోవడం వల్ల సమస్యలను ఎదుర్కొన్నారు. రుణాలు రాకపోవడం, రైతుబంధు పడకపోవడం వంటి ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యలన్నీ పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. భూములకు సంబంధించిన సమస్యలన్నీ పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేసింది. మొదట కొన్ని మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని ఆ మండలం పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. గ్రామాల వారీగా రైతుల సమస్యలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని వెరిఫికేషన్ చేయ డంతో పాటు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి పరిష్క రిస్తున్నారు. మండల స్థాయిలో పరిష్కారం అయ్యే వాటినన్నింటిని అక్కడే పూర్తి చేశారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మెండోరా మండలాన్ని ఎంపిక చేశారు. సుమారు 15 రోజుల పాటు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల నుంచి ఈ మండలం పరిధిలోని అన్ని గ్రామాల పరిధిలో 706 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా ఇప్ప టి వరకు 250 దరఖాస్తులను వెరిఫికేషన్ చేశారు. వాటిలో 80 దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించారు. మిగతా దరఖాస్తులను పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈనెల 20 వరకు సదస్సుల నిర్వహణ

జిల్లాలో ఈనెల 3 నుంచి 20 వరకు ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నారు. అర్బన్ మండలాలతో పాటు మెండోరా మండలం మినహా మిగతా అన్ని మండలాల పరిధిలో ఈ సదస్సులను నిర్వహించనున్నారు. సుమారు 17 రోజుల పాటు ఈ సదస్సులను నిర్వహించడంతో పాటు పూర్తిస్థాయిలో భూసమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా మండలాల పరిధిలోని ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్ ఇతర సిబ్బందితో ఏర్పడిన బృందం సభ్యులు ఈ సదస్సులో పాల్గొంటారు. రైతులకు సంబంధించి భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆయా గ్రామాల పరిధిలో వచ్చే దరఖాస్తులను ఏరోజుకు ఆరోజు పరిశీలించడంతో పాటు భూముల సమస్యలను బట్టి ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తారు. మండల స్థాయిలో అన్ని గ్రామాల పరిధిలో సదస్సులు పూర్తయిన తర్వాత వచ్చిన మొత్తం దరఖాస్తులను పరిశీలిస్తారు. మళ్లీ గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వేను నిర్వహించి ఆ దరఖాస్తు ఆధారంగా

మిగతా 6వ పేజీలో...



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

నిజామాబాద్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్‌భవన్‌లో నిర్వహించిన ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ప్రథమ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభలను టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న జెండాను ఎగరవేశారు. కార్మిక ఉద్యమంలో అమరవీరులను స్మరిస్తూ టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ఆమోదిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజల వినియోగ వస్తువులపై రోగుల మందులపై చివరికి చదువుకునే పిల్లలు వాడే పెన్సిళ్లు, చాక్‌పీస్‌లపై కూడా టాక్స్‌లు వేస్తున్నారని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని అన్నారు. మరో ముఖ్య వక్తగా హాజరైన టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తూ వారికి కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రతను దూరం చేసిందని కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం హరించివేస్తుందని అన్నారు. తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందని అందుకు కార్మిక సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. మహాసభలో టీయూసీఐ నాయకులు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను చర్చించి ఆమోదించారు. అరుణోదయ కళాకారులు, కార్మికుల కష్టాలను తెలుపుతూ పాడిన పాటలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, రాజేశ్వర్, సహాయ కార్యదర్శి మల్లేష్, టీయూసీఐ జిల్లా నాయకులు విఠల్, కిరణ్, రాజేశ్వర్, రెహానా, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయన్న, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి వాయిదా

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. తిరిగి జూన్ 9వ తేదీ నుంచి ప్రతీ సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

- సిద్ధమైన పోలీసు పరేడ్ గ్రౌండ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించనున్న ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్



6

చిన్నారుల చిరుతిళ్లపై కమ్ముతున్న విషం!

- జిల్లాలో జోరుగా నకిలీ బ్రాండ్ తినుబండారాల విక్రయాలు
- చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా
- రంగురంగుల ప్యాకెట్లు 5 రూపాయలకే అమ్మకం
- తనిఖీలు చేపట్టని ఆహార నియంత్రణ అధికారులు

5



- విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా కేటాయింపులు
- పాఠశాలల వారీగా వివరాలు సేకరిస్తున్న అధికారులు
- పాఠశాలల పునఃప్రారంభంలోపే పూర్తయ్యేలా ఏర్పాట్లు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ఉపాధ్యాయుల సర్దుబాటుకు కసరత్తు

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను అధిగమించేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఈనెల 12న పాఠశాలల పునఃప్రారంభంలోపే ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎంత, ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు, ఎంత మంది అవసరం, ఎంత మంది అదనంగా ఉన్నారు, తదితర వివరాలను సేకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లాలోని పాఠశాలల వారీగా మండల విద్యాశాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో 1156 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 5436 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. జిల్లాలో చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోగా విద్యార్థులు తక్కువగా ఉన్నచోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. తద్వారా విద్యార్థులకు సరైన విద్యాబోధన జరగడం లేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై రోజురోజుకు ఆదరణ తగ్గుతుంది. దీంతో ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలల వారీగా ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలను సర్దుబాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను ఆ కాంప్లెక్స్ పరిధిలోనే, అంతకు మించి ఉన్న ఉపాధ్యాయులను మండలం పరిధిలో సర్దుబాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ రాజకీయ నేతల ఒత్తిడితో కొంత మంది ఉపాధ్యాయులు మండలాలు దాటి సర్దుబాటు అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండేందుకు కొంత మంది ఉపాధ్యాయులు సర్దుబాటులో భాగంగా ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు..

నిబంధనల ప్రకారం ఒక్కో పాఠశాలలో 1-10 మంది విద్యార్థులకు 1 ఉపాధ్యాయుడు, 11-60 మంది విద్యార్థులకు 2 ఉపాధ్యాయులు, 61-90 మంది విద్యార్థులకు 3 ఉపాధ్యాయులు, 91-121 మంది విద్యార్థులకు 4 ఉపాధ్యాయులు, 121-150 మంది విద్యార్థులకు 5 ఉపాధ్యాయులు, 151-200 మంది విద్యార్థులకు 6 ఉపాధ్యాయులు, 200 మంది విద్యార్థులు దాటిన తర్వాత 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. కానీ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండి ఉపాధ్యాయులు తక్కువ మంది ఉన్న పాఠశాలలు ఉండగా ఎక్కువ మంది ఉపాధ్యాయులు తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం విద్యాశాఖ సర్దుబాటు నిర్ణయం తీసుకోవడంతో ఒక కాంప్లెక్స్ పరిధిలో

మిగతా 6వ పేజీలో...

విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండాలి..



విద్యాశాఖ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ప్రారంభించడం మంచి పరిణామం అయినప్పటికీ ఈ విషయంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సర్దుబాటు ఉండాలి. కానీ ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సర్దుబాటు చేస్తే మాత్రం విద్యార్థులకు తీవ్ర నష్టం. గతంలోనూ సర్దుబాటును ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా మార్చుకొని జిల్లా కేంద్రాలకు, రవాణా సౌకర్యం ఉన్న చోటకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీనివల్ల గ్రామీణ విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగింది.

– గంగాధర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలి..



విద్యాశాఖ నూతనంగా ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలి. 1-10లోపు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 30 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 50 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటే బాగుంటుంది. తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండడం ద్వారా విద్యార్థులకు లాభం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులను విరమించుకొని కొత్త మార్గదర్శకాలను విడుదల చేయాలి.

– గంగోనే కిషన్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి:



నేటి నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

సుభాష్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి స్లాట్ బుకింగ్ ప్రక్రియను ప్రారంభించింది. సోమవారం నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారానే రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. గంటల తరబడి కార్యాలయాల్లో నిరీక్షించకుండా ఇళ్లను, ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గత కొన్ని రోజుల క్రితం ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను ప్రారంభించనుంది. సోమవారం నుంచి నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, భీంగల్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. రోజుకు 48 స్లాట్లను రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఉదయం 24 స్లాట్లు, మధ్యాహ్నం 24 స్లాట్లను డాక్యుమెంట్లు చేసేలా విభజించారు. రిజిస్ట్రేషన్ కోసం ముందుగా రిజిస్ట్రేషన్.తెలంగాణ.గోఇన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. స్లాట్ బుకింగ్ లేకపోతే రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు మాత్రమే కార్యాలయానికి రావాలని అధికారులు కోరారు.

నేటి నుంచి 'క్వాలిటీ సీడ్ ఫర్ ఎవ్రీ విలేజ్' కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికీ నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా సోమవారం నుంచి క్వాలిటీ సీడ్ ఫర్ ఎవరీ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని జిల్లాకు 880 వరి, 440 పెసర్ల విత్తనాలు విత్తనోత్పత్తి కోసం ప్రతీ రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేయబడిన పది మంది రైతులకు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా విత్తన సంచులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శిం చారు. వేల్పూర్ మండల్ పడిగెల గ్రామ శివారులో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి రోడ్లపై ఉన్న, మొలకలు వచ్చిన ధాన్యాన్ని వరిధాన్యం కుప్పలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా ధాన్యం తరలించలేదన్నారు. లారీలు సకాలంలో రాక బాల్కొండ నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో రోడ్లపైన ధాన్యం సంచులు ఉన్నాయన్నారు. తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాకు రూ.500 రూపాయల బోనస్ చెల్లించాలన్నారు. పూర్తిగా ధాన్యం సేకరించేవరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ కు ఫోన్‌లో మాట్లాడి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సూచించారు. గత నెల రోజులుగా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నప్పటికి సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులపై, మిల్లర్లపై నియంత్రణ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సకాలంలో పంట కొనుగోలు చేశారన్నారు. అదే విధంగా అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గుర్తు చేశారు. పడిగెల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులు ధాన్యం కొనుగోలుకు ఈరోజే చివరి రోజు అని అంటున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అక్కడే ఉన్న ఐకేపీ సిబ్బందిపై ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల పార్టీ అధ్య క్షుడు జైడి నాగధర్‌రెడ్డి, పడిగెల సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, గంగారెడ్డి, గొల్ల రాజేశ్వర్, సొడ రమేష్, తలారి శేఖర్, నితీష్ కుమార్, ద్యావతి రాజ్‌కుమార్, శ్యాంరావ్, సుధాకర్ గౌడ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


పడిగెలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బోధన్‌లో తిరంగా ర్యాలీ


బోధన్‌లో తిరంగా ర్యాలీలో పాల్గొన్న యువకులు

బోధన్‌రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత సైన్యం చూపిన ధైర్య సాహసనాలను అభినందిస్తూ దేశ ఐక్యత చాటుతూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బోధన్‌లో పెద్దహనుమాన్ మందిరం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం సందర్భంగా భారత సైనికుల పరాక్రమాన్ని గర్వంగా గుర్తిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. యువత ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, వివిధ గ్రామాల నుంచి యువత అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతీ ఒక్కరు పాల్గొని ర్యాలీ విజయవంతం చేసినందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్ రెడ్డిలు యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

అందరు భక్తి మార్గంలో పయనించాలి


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న పీఠాదిపతి మాధవానంద సరస్వతి

ఆర్మూర్‌టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో ప్రయాణించాలని పీఠాధిపతి మాదవనంద సరస్వతి అన్నారు. ఆదివారం వరంగల్ నుండి బాసర సరస్వతి మందిరానికి వెళ్తుండగా పట్టణంలోని రాజారాంనగర్ శివాలయాన్ని దర్శించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు పీఠాధిపతి మాదవనంద సరస్వతిని మంగళహారతులలతో స్వాగతం పలికారు.

ఆలూర్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి


ఆలూర్‌లో సమావేశమైన యువకులు

ఆర్మూర్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డికి యువకులు, కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, శ్రీనివాష్, మల్లయ్య, నవనీత్, విడిసి అధ్యక్షుడు బార్ల ముత్యం, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన నందిపేట కార్యవర్గ సభ్యులు

నందిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్త బైపాస్ రోడ్డులో ఉన్న ఏ-1 ఫంక్షన్ హాలులో ఆదివారం ముస్లిం మైనార్టీ కమిటీని పూర్తి స్థాయిలో ఎన్నుకున్నట్లు అధ్యక్షులు శౌకతుల్ బారీ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మగ్బూల్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఖదీర్, షేక్ ఇమ్రాన్, సయ్యద్ జమీల్ ఎన్నికైనా రు. అలాగే కోశాధికారిగా అబ్దుల్ ఘనీ, సంయుక్త కార్యదర్శులుగా ఫారూఖ్ ఖాన్, షేక్ వాజీద్, కార్యనిర్వహణ సభ్యులుగా షేక్ ఇస్మాయిల్, షేక్ హుస్సేన్ అబ్దుల్లా ఎన్నికైనారు. నూతన కమిటీని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల కోప్షన్ మాజీ సభ్యులు సయ్యద్ హుస్సేన్, నాయకులు ఉషోద్దిన్, కలీం బాయ్, ఆఫీస్ బాయ్, ఎస్‌కె జావెద్, జోర్‌పూర్ ఇమ్రాన్ తధితరులు ఉన్నారు.

యువకులకు బ్యాట్‌లు పంపిణీ చేసిన ఎస్సై

మోర్తాడ్ , జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యువకులకు మోర్తాడ్ ఎస్సై విక్రం క్రికెట్ బ్యాట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు చదువులో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో చదివి ఉత్తమ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గిర్మాజి గోపి,యువకులు పాల్గొన్నారు.

కిచెన్ షెడ్ నిర్మాణం కోసం నిధుల మంజూరు

నాగిరెడ్డిపేట,జూన్ 1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో కిచెన్ షెడ్ నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.10 లక్షల జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంజూరు చేసినట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. మోడల్ స్కూల్లో కిచెన్ షెడ్ డైనింగ్ హాల్ కోసం ప్రతిపాదనలు పంపించగా డీఈవో కృషితో జిల్లా కలెక్టర్ కిచెన్ షెడ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు.

ఆర్‌టీసీ బస్, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

నందిపేట, జూన్ 01 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆదివారం ఆర్‌టీసీ బస్, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో మేకల మురళికి తీవ్ర గాయాలైనాయి. నందిపేట నందిపేట నుంచి మాయాపూర్‌కు తన బైక్‌పై వెళ్తున్న మేకల మురళిని నిజామాబాద్ నుంచి నందిపేట వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్ ఢీ కొట్టిందన్నారు. దీంతో మేకల మురళికి తీవ్ర గాయాలయ్యాయన్నారు.స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో మురళిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బోధన్‌రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహాన్ని ఆదివారం అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చైల్డ్ కమిటీ సభ్యులు పద్మాసింగ్ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18సంవత్సరాలు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలని, ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందన్నారు. కావున తల్లిదండ్రులు అమ్మాయిలపై చిన్నచూపు చేయకుండా 18 సంవత్సరాలు పూర్తయిన అనంతరమే వివాహం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కమిటీ సభ్యులు పద్మాసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపి లక్ష్మి, ఐసీపీఎస్ టీమ్ సౌజన్య, సాయిలు, స్వప్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రిలే దీక్ష

నవీపేట,జూన్1(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రానికి చెందిన పలువురు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన నవీపేటలో కేవలం 100ఇళ్లు మాత్రమే మంజూరు చేయడం శోచనీయమని అన్నారు. అర్హులైన చాలామంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాలేదని వెంటనే అందరికి ఇళ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులింటి నర్సింలు, చందు కుమార్, నాగమణి, పుష్ప, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కమ్మర్‌పల్లి,జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెంది ప్రతిభ (9వ తరగతి) అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పో టీలకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమార్ తెలిపారు.ఈ నెల 4 నుంచి 6వ తేదీవరకు మూడు రోజుల పాటు నల్గొండాలో నిర్వహింపబడే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

దేవాంగ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి


విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్న కార్యదర్శి కొంగి గంగాధర్

ఆర్మూర్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేవాంగ విద్యార్థులు పట్టుదలతో చదివి అన్ని రంగాలలో రాణించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని హెచ్‌ఎండీఏ కార్యదర్శి కొంగి గంగాధర్, రిటైర్డ్ సీటీవో రాజేశ్వర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని దేవాంగ సంఘ భవనంలో ఆదివారం జిల్లా దేవాంగ విద్యాకమిటి ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిన చూపిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో లక్ష్యాలను ఏర్పారుచుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని 32 గ్రా మాలకు చెందిన పదోతరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రతిభ పుర స్కారాలను అందజేశారు. జిల్లా స్థాయిలో మట్ట రోహన్‌రాజ్ ప్రథమ, రాస రస్మిత ద్వితీయ, పాత రష్మి తృతియ స్థానంలో నిలిచారు. అదే విధంగా గ్రామ స్థాయిలో 20 మంది విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహు మతులు అందజేశారు. అంతేకాకుండా 10 మంది విద్యార్థులకు రూ.5000 చొప్పున స్కాలర్ షిప్‌ను అదజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాంగ విద్యాకమిటి సభ్యుడు భూపాల వినయ్, రఘునాథ్, భూమేశ్వర్, చంద్ర మోహన్, మామిడిపల్లి భూమయ్య, కొంగి రాము, మోహన్, జిల్లా దేవాంగ సంఘం అధ్యక్షుడు గడ్డి ప్రకాష్, డిష్ గంగాధర్, రాస రాము, బెనికి నారాయణ, కొంగి సదాశివ్, రాస రాము, రాస ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే పదవిని తొలగిస్తారా

● ఆదరబాదరగా నూతన సమాఖ్య ఏర్పాటు ● ఏపీఎంని నిలదీత


రెంజల్ మండల ఏపీఎంను నిలదీస్తున్న మాజీ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి గంగామణి

రెంజల్,జూన్1(ఆంధ్రజ్యోతి): గత మూడు సంవత్సరాల నుండి మండల సమాఖ్యకు సంబంధించిన చిట్టాపద్దు వివరాలతో పాటు మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన హార్వెస్టర్‌కు సంబంధించిన వివరాలను అడిగిన మాజీ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మికి ఎటువంటి లెక్కలు చెప్పకుండా అడిగిన సమాఖ్య అధ్యక్షురాలుకి సమాచారం ఇవ్వకుండా నూతన స మాఖ్య కార్యవర్గాన్ని ఆదరబాదరగా ఏర్పాటు చేసుకుని మహిళను విస్మరించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం తమ పదవికాలం పూర్తయిన తర్వాత నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే సమయంలో పాత కార్యవర్గాన్ని ఆహ్వానించాల్సి ఉండగా తమకు ఎలాంటి సమాచారం అందించకుండా కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్న పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వరికోత యంత్రానికి సంబంధించిన అప్పులు తప్ప లాభాలు లేవని ఇదే విషయమై ఏపీఎంను ప్రశ్నిస్తే పట్టించుకోకుండా తమ పదవులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. మండల సమాఖ్యలో ఏపీఎంతో పాటు సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే వీవోలను అణగదొక్కుతున్నారని అన్నారు. బైలా అంటూ నిరాక్షరాస్యులైన మహిళ సంఘాల సభ్యులను ఏపీఎం తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని మండల స్థాయి నుండి జిల్లా అధికారుల వరకు విషయం తెలిసిన విచారణ చర్యలు చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని విలేకరుల ముందు వాపోయారు. కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళ సంఘాలకు కమిషన్ రూపంలో వస్తున్న లాభాలనే రికార్డుల ద్వారా చూపుతూ వరికోత యంత్రం ద్వారా వస్తున్న ఆదాయాన్నే తెలుపడం లేదని వరికోత ద్వారా ఇప్పటి వరకు నష్టాలు తప్ప లాభాలు శూన్యమని తెలిపారు. వరికోత యంత్రం ద్వారా మహిళ సమాఖ్యకు ఆదాయం రావాల్సి ఉండగా ప్రతియేటా మరమ్మత్తుల పేరిట నష్టాలు వస్తున్నాయంటూ తప్పుడు లెక్కలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. మహిళ సమాఖ్య అనుమతి లేకుండా తమతో సంతకాలు చేయించుకుని బిల్లులతో పెద్ద మొత్తంలో డ్రా చేసుకున్నట్లు పేర్కొన్నారు. అందులో తమకు కొంత ఇచ్చామని ఏపీఎం అనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కామారెడ్డిటౌన్,జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్గుల్ గ్రామానికి చెందిన గుంటికాడి నర్సింలు(45) గ్రామశివారులోని నిర్మాణంలో ఉన్న గంగపుత్ర సంఘం వద్ద గల నిచ్చెనకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలి పారు. వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న గుంటికాడి నర్సింలు తన మొ దటి భార్య కూతురు పెండ్లికి అప్పుచేయడం, ఆటో సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బం దులతో బాధ పడుతుండేవాడు. ఇదేక్రమంలో శనివారం రాత్రి ఇంట్లోనుంచి వెళ్లిన నర్సిం లు అర్థరాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతుకుతుండగా ఆదివారం ఉదయం గ్రామశివారులో నిచ్చెనకు ఉరేసుకుని నర్సింలు కనిపించాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్యవినోద ఫిర్యాదుచేసిందని తెలి పారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వేల్పూర్‌లో గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం

వేల్పూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఆది వారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు గంగనీళ్ల వలగొడుగుతో డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలో ప్రధాన వీధులగుండా ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని పోచమ్మ, ఇతర గ్రామ దేవతల విగ్రహాలను గంగ నీళ్లతో జాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృదిద కమిటి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 16 వరకు రెవెన్యూ సదస్సులు

కమ్మర్‌పల్లి,జూన్1(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి జూన్ 16 వరకు షెడ్యూల్డ్ ప్రకారం గ్రామ రెవెన్యూ సదస్సులు ఆయా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహింపబడతాయని కమ్మర్‌పల్లి తహసీల్దార్ తెలిపారు.ఈరెవెన్యూ సదస్సుల నిర్వహణ అధికారుల నియమించినట్లు తెలిపారు. జూన్3 నాగాపూర్, 4న ఇనాయత్ నగర్, 5న నర్సాపూర్, 6న కోనాపూర్, 9న అమీర్‌నగర్, 10 కోనాసమందర్, గుడిలింగాపూర్, 11న చౌట్‌పల్లి , లక్ష్మాపూర్, 12న బషీరాబాద్, 13న హసాకొత్తూర్,16న ఉప్లూర్, అనుబంధ గ్రామం దమ్మన్నపేట్, 17న కమ్మర్‌పల్లి, మండలంలోని రెవెన్యూ గ్రామాలు బైలూర్, రీచ్‌పల్లి గుంటపల్లి గ్రామాలలో రెవెన్యూసదస్సులు జరుగుతాయన్నారు.ఆయా గ్రామాల రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకుంటూ తమ వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిస్కారం కోరుతూ.. దరకాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు గ్రామాల వారిగా రెవె న్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లుతహసీల్దార్ కిరణ్మయ్ తెలిపారు. మంగళవారం నారాయాణపేట్, మునరాబాద్ 4న పుప్పాలపల్లి, మాదా పూర్, 5న కలిగోట్, చింతలూర్, 6న కొలిప్యాక్, 9న తొర్లికొండ, 10 బ్రా హ్మన్‌పల్లి, 11న అర్గుల్, 12న లక్ష్మాపూర్, 13న మునిపల్లి, 16న జక్రాన్ పల్లి, 17 సికింద్రాపూర్, 18న పడకల్, 19 కేశ్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈరెవెన్యూ సదస్సులను రైతులుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రెంజల్,జూన్1(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాదర్ అన్నారు. ఆదివారం రెంజల్ మండలంలోని బోర్గాం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, షేక్ నసీర్, ఒడ్డెన్న, పెద్దులు, సిద్ద పోశెట్టి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నవీపేటలో 1999-2000బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవీపేట,జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగల్ ఎంఆర్ఎల్ గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన 1999-2000ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 25సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకుని తమ యోగాక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలు వంటి విషయాలను చర్చించుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యకు బోధించిన ఉపాధ్యాయులను శాలువా,పూలమాలలతో సత్కరించారు.అనంతరం తమకుటుంబ సభ్యులతో కలిసిసహపంక్తి భోజనం చేశారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్,నర్రా రామారావు, సంజీవ్,నర్సయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం వ్యాఖ్యాతగా జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు రాధ వ్యవహరించారు.

పోతంగల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కోటగిరి,జూన్1(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1996-97లో పదవ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యబుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 28ఏళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు ఆనందోత్సహాలలో నిమగ్నమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. ఒకరినొకరు తమ యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విందు, వినోదాలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు శ్రీరాం, రామిరెడ్డి, మందాకిని, దుర్గాలను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయిలు, సంతోష్, గజానన్, సుదర్శన్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

సాలూరా,జూన్1(ఆంధ్రజ్యోతి): మంజీర సరిహద్దు గ్రామాలైన కొప్పర్గ, హంగర్గ గ్రామాల మీద నుండి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఇసుక అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేయవద్దన్నారు. శనివారం రాత్రి రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నామన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారమే ఇసుకను తరలించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నందిపేటలో పూర్వ విద్యార్థుల రజతోత్సవం


గురువులతో 2000-2001 పూర్వ విద్యార్థులు

నందిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నంది ప్రగతి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల(2000-2001 ఎస్ఎస్‌సీ బ్యాచ్) రజతోత్సవ సమ్మేళనం ఆనందోత్సవాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిన్నతనంలో కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని వెల్లడించారు. ఇక్కడికి వచ్చిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కారణం కష్టపడి చదవడమేనని అన్నారు. పూర్వ విద్యార్థులు అందరు ఓకే చోటికి చేరుకొని సమ్మేళనం చేయడం అభినందనీయమన్నారు.గతంలో జరిగిన అనుభూతి సంఘటనలను నెమరేసుకున్నారు.2000-2001 ఎస్ ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల పిల్లల డ్యాన్సులు చేశారు. పాట లు పాడారు.ఈ కార్యక్రమంలో తోటగణేష్, నామ నరేష్, ఎర్రం హన్మాండ్లు, మహ్మద్ ఇర్ఫాన్, తోట రవి కుమార్, సంపత్ తదితరులు ఉన్నారు.

బోధన్‌లో ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బోధన్‌రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్‌లో 2006-07పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్ పూర్వ విద్యార్థులు హాజరై ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణం సందడి నెలకొంది. స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంత్‌రావు, ఉపాధ్యాయులు రామకృష్ణ, శ్రీనివాస్, హన్మాండ్లు, అనిత, పూర్వవిద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మద్నూర్‌లో 1998-99 బ్యాచ్ విద్యార్థుల బృందం

మద్నూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకొని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్య బుద్ధులు నేర్పిన గురువులైనా గంగారాం, లక్ష్మయ్య, మనోహర్, కాషా గౌడ్, సునీల్, నరేందర్, రమేష్ భారత భూషణ్‌లను ఘనంగా సన్మానించారు పాతికేళ్ల తర్వాత తామంతా కలుసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రఘు, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

తాండూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తాండూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నాగిరెడ్డిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ద్వారా సుమారు 33 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు తిరిగి ఒకే చోట కలిసి తమ విద్యార్థి దశలోని పాత జ్ఞాపకాలను, అప్పట్లో చేసిన అల్లరి, చిలిపి పనులను వారు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అప్పటి ఉపాధ్యాయులను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. వారికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగారెడ్డి, శీను, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేల్పూర్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలలోని రామన్న పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థు లు తిరిగి ఒకే చోట కలిసి తమ విద్యార్థి దశలోని పాత జ్ఞాపకాలను, నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అప్పటి ఉపాధ్యాయులను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

మెండోర,జూన్ 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోడిచర్లలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ కొమ్ముల చిన్నదేవేందర్ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బాల్కొ ండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. సునీల్‌కుమార్ వెంట కాంగ్రెస్‌నాయకులు రవి,మల్లేష్, శ్రీనివాస్, రవి తదితరులున్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా

భీమ్‌గల్ , జూన్ 1 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణంలోని బడాభీంగల్ రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వలస కూలీ దీపక్‌గిరి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై మహేష్ తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మృతుడు నలుగురు సహచర కూలీలతో మే నెల 18న పట్టణ కేంద్రంలో సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంబాలను ట్రాక్టర్లో ఎక్కించే పనిలో చేరాడు. దీంట్లో భాగంగా ఆదివారం సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంబాలను ట్రాక్టర్‌లో ఎక్కించుకున చేంగల్ వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ డివైడర్ పైకి దూసుకెళ్లడంతో ట్రాక్టర్ బోల్తా పడడంతో మృతుడు తలకు తీవ్ర గాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సహచర కూలీలు సహదుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫటా..ఫట్...

పాడి పశువులతో రైతుల అభివృద్ధి

● పండరీనాథ్, పశువైద్యాధికారి, జుక్కల్



ఆంధ్రజ్యోతి: వర్షాకాలం ప్రారంభంలో పశువుల కలుషిత నీరు తాగడం వల్ల గొంతు వాపు వ్యాధి వస్తుంది. నివారణ చర్యలు చేపడుతున్నారా?

అధికారి: వర్షాకాలం ప్రారంభంలో పశువులు అటవీ ప్రాంతంలో మేత తిన్న అనంతరం గుంతలలో ఆగిన నీరు కలుషిత నీరు తాగుతాయి. దాని వల్ల గొంతు వాపు వచ్చే అవకాశాలుంటాయి. నివారణకు ఆవులకు బి క్యాబర్లకు హెచ్ఎస్ టీకాలు వేస్తాం. దీంతో గొంతు వాపు వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

ఆంధ్రజ్యోతి: గొర్రెలు, మేకలకు వర్షాకాలంలో చీటికి రోగం వస్తుంది. నివారణ చర్యలు చేపడుతున్నారా?

అధికారి: వర్షాకాలం ప్రారంభంలో భూమిపై కొత్త గడ్డి మొలవడంతో మేకలకు, గొర్రెలకు చిటికి రోగం రావడం కనబడుతోంది. నివారణకు పీపీఆర్ టీకా వేస్తే వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

ఆంధ్రజ్యోతి: జుక్కల్ మండలంలో ఆవులు, గేదెలు ఎన్ని ఉన్నాయి?

అధికారి: జుక్కల్ మండలంలో వివిధ గ్రామాలలో 4,855 ఆవులు, 3,456 గేదెలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: కృత్రిమ గర్భాధారణతో పశువులకు పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయా?

అధికారి: రైతులు వారి వారి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించుకుంటే పుట్టే ఆడదుడ్డలు బలంగా ఉంటాయి. అదే విధంగా రైతులు 250 రూపాయలు చెల్లిస్తే ఎస్ఓఆర్‌టీడీ టీకా ద్వారా పశువులకు ఆడదుడ్డ పుట్టే అవకాశం ఉంది. అదే విధంగా రైతులు గడ్డి విత్తనాలు తీసుకుని వారి పంట పొలంలో గడ్డిని పెంచుకుని పశువులకు మేతగా వేస్తే పశువులు పాలు ఎక్కువగా ఇస్తాయని ఆయన అన్నారు.

● (ఆంధ్రజ్యోతి, జుక్కల్)

రాజకీయ నాయకుల చేతుల్లో రాజీవ్ వికాసం

● ముమ్మరంగా పావులు కదుపుతున్న రాజకీయ నాయకులు
● తమ వారికే దక్కాలంటూ అధికారులపై ఒత్తిడి
● నష్టపోతున్న నిజమైన యువత



దరఖాస్తులు చేసుకుంటున్న యువత

నసురుల్లాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండవ తేదీ నుంచి ప్రారంభించనున్న రాజీవ్ యువ వికాస్ పథకం అభాసుపాలవుతుంది. నస్రుల్లాబాద్ మండలంలో లబ్ధిదారుల ఎంపిక కేవలం రాజకీయ నాయకుల చేతుల్లో ఉండడం విడ్డూరం. తమ నాయకుల కుటుంబాలకు సంబంధించిన తమ కార్యకర్తలకు చెందిన యువకులను మాత్రమే ఎంపిక చేసేల ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో నిజమైన యువకులకు అన్యాయం జరుగుతుందని ఆయా గ్రామాలకు చెందిన యువకులు వాపోతున్నారు.

● అధికారులపై ఒత్తిడి

రాజీవ్ యువ వికాసం పథకం తమకు చెందిన వారిని ఎంపిక చేయాలంటూ రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనితో తమకేమి సంబంధం లేదంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పట్టాభద్రులైన యువకులు తమ సొంత కాళ్లపై నిలబడాలన్న ఆశలు గల్లంతవుతున్నాయని, యువకులు ఆందోళన చెందుతున్నారు.

● వర్గపోరుతో ఎంపికలు జాప్యం

మండలంలో అధికార పార్టీకి చెందిన నాయకులలో వర్గ పోరు ఉండడంతో తమకు చెందిన వారికి దక్కాలంటూ ఒక వర్గం, లేదు లేదు తమ వర్గానికి చెందిన నాయకుల కుటుంబ సభ్యుల పిల్లలకు రాజీవ్ యువ వికాసం స్కీమ్ అందేలా ప్రయత్నాలు చేస్తున్నారు.. ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు పాల్పడకుండా, నిజమైన యువకులకు రాజీవ్ యువ వికాస్ పథకం దక్కాలంటూ యువత కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి నిజమైన యువకులను ఎంపిక చేసి రాజీవ్ యువ వికాస్ పథకం దక్కేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగానే జరుగుతుంది

నస్రుల్లాబాద్ మండల వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఫారాలన్నీ పరిశీలన పారదర్శకంగానే జరుగుతుంది. ఏ నాయకుల ఒత్తిడి లేకుండానే దరఖాస్తు ఫారుల పరిశీలన జరుగుతుంది.. యువకుల దరఖాస్తు ఫారాల నివేదికలు పూర్తిస్థాయిలో తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.

- సూర్యకాంత్, ఎంపీడీవో, నసురుల్లాబాద్



గత సంవత్సరం గాంధీనగర్ కాలనీలో వరదనీటితో నీటిలో మునిగిన కారును బయటకు తీస్తున్న దృశ్యం(ఫైల్)



సిరిసిల్లా రోడ్డు నుంచి గాంధీనగర్ వెళ్లే ప్రాంతంలో తాత్కాలికంగా నిర్మించిన మురికి కాలువ దుస్థితి



ఎల్లమ్మగుడి వెనుక భాగంలో వరద నీరు పోయే కాలువ దుస్థితి

ఫోకస్

ముంపు ప్రాంతాలపై ముందస్తు చర్యలేవీ?

» వానాకాలం మొదలైనా కనిపించని స్పెషల్ డ్రైవ్‌లు » చిన్నపాటి చినుకులకే రోడ్లన్నీ జలమయం
» భారీ వరద నీటి కాలువలలో పూడిక తీయని వైనం » ప్రతీ యేటా వరద ముంపు ఉన్నా పట్టించుకోని అధికారులు

కామారెడ్డిటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ యేటా ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోక పోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వానాకాలం వస్తే చాలు అనేక అవస్థలు పడాల్సి వస్తుంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఎక్కడికక్కడ మురికి కాలువల్లో పూడికమట్టి పేరుకుపోవడం, పలుచోట్ల మురికి కాల్వల నిర్మాణం లేక పోవడం, కాల్వలపై అడ్డదిడ్డంగా వర్షపు నీరు పోకుండా స్లాబ్‌లు వేసిన కనీసం పట్టించుకోకపోవడంతో చిన్నపాటి చినుకులు పడితే చాలు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. ఇక భారీ వర్షం వస్తే ఆయా ప్రాంతాల పరిస్థితి చెప్పనక్కరలేదు. చిన్నపాటి చెరువులను తలపిస్తాయి. ఏండ్లుగా ఈ సమస్య ఉన్న కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరించడంతో వర్షా కాలం వచ్చిందంటే చాలు ప్రజలు వరదనీటి సమస్యతో బాధ పడుతున్నారు. వానకాలం మొదలైన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాల్సిన అధికారులు తూతూ మంత్రంగా పలుచోట్ల పూడికలు తీసి ఆ ఫోటోలను పై అధికారులకు పంపించి సమస్యలు ఏమి లేవని మాయచేస్తున్నారు. గత సంవత్సరం ముంపునకు గురైన పలు ప్రాంతాలను ఆదివారం ఆంధ్రజ్యోతి పరిశీలన చేపట్టగా మున్సిపల్ అధికారుల పనితీరు తెటతెల్లం అ యింది. పాలక వర్గాలు మాకు ఆదేశాలు ఇవ్వలేదంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తూ వచ్చిన అధికారులు ఇప్పుడు స్పెషల్ అధికారి పాలనలోనే పనిచేస్తున్నారు కదా మరి ఎందుకు ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వరద కాలువను పట్టించుకునే వారే కరువు

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పంచముఖి హనుమాన్ కాలనీ నుంచి మొదలుకొని బతుకమ్మకుంట, టీచర్స్ కాలనీ, సుభాష్ టాకీస్, గాంధీ నగర్, వాసవి కాలనీ, సిరిసిల్లా రోడ్డు నుంచి ఎల్లమ్మగుడి వరకు, సిరిసిల్ల రోడ్డు నుంచి వీక్లి మార్కెట్ పోయే చౌరస్తా నుంచి ఎల్లమ్మ గుడి వెనుక భాగం వరకు రోడ్డుకు ఇరువైపుల భారీ వరద కాలువ ఉంది. ఈ కాలువలలో పూడిక మట్టి తొలగించకపోవడం, వరద నీరు పోయ్యేలా చిన్న పాటి కాల్వలను ఏర్పాటుచేయక పోవడం, మురికికాలువలపై పలుచోట్ల స్లాబ్‌లు పోసి పూర్తిగా మూసి వేయడంతో వరద నీరు పోక రోడ్లన్ని చిన్నపాటి చెరువులను తలపిస్తుంటాయి. ప్రతీసారి ఇళ్లలోకి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచముఖి హనుమాన్ కాలనీ నుంచి మొదలు కొని సిరిసిల్లరోడ్డులోని కన్యకా పరమేశ్వరి కమాన్ వరకు ఈ వరద కాలువలో పలుచోట్ల పేరుకపోయిన పూడిక మట్టిని తొలగించక పోవడంతో ప్రస్తుత వర్షాకాలంలో సైతం కొద్దిపాటి వరద వస్తే చాలు రోడ్లన్నీ జలమయం అయ్యే అవకాశం లేకపోలేదు. సిరిసిల్ల రోడ్డులోని గాంధీ గంజ్ గేటు నుంచి వీక్లిమార్కెట్ పోయ్యే చౌరస్తా వరకు మురికి కాలువ సరిగా లేక నీరంతా రోడ్డుపైన పారుతుంది. ఇక రామారెడ్డిరోడ్డులోని సఖి కేంద్రం నుంచి మొదలుకుని సుభాష్ టాకిస్ వరకు ప్రతీ సారి వరద వస్తే ఈ రోడ్డు మూసివేయాల్సింది. టీచర్స్ కాలనీలోని ప్రజలు అవస్థలు మామూళ్లుగా ఉండవు వరద నీరు అంతా మోకాళ్ల లోతు వరకు చేరుతుంది. ఎండకాలంలో ఈ వరద కాలువపై ప్రత్యేక దృష్టిసారించి కూలిన చోట్ల నిర్మాణాలు, పూడిక తీత చేపట్టాల్సి ఉన్న అధికారులు మాత్రం అటువైపు కన్నెతి చూడక పోవడంతో ఈ సారి ప్రజలకు అవస్థలు తప్పెటులేవు.

ముంపునకు గురవుతున్న పలు ప్రాంతాలు

ప్రతీ యేటా కొన్ని ప్రాంతాలు ముంపుకు గురవుతున్న అధి కారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లుగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రతీ యేటా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిపై కనీసం దృష్టి సారిద్దామనే ఆలోచన చేయడం లేదంటే ఏ స్థాయిలో అధికారుల పనితీరు ఉందో అర్థం చేసుకోవచ్చు. టీచర్స్ కాలనీ, పంచముఖి హను మాన్‌కాలనీ, గాంధీనగర్, వాసవీ కాలనీలు, సుభాష్ టాకీస్ నుంచి సఖి కేంద్రం వరకు, సైలాన్‌బాబా కాలనీ, బతుకమ్మ కుంట ప్రాంతాల్లో పలు చోట్ల అసలు మురికికాలువలు అనేవి లేక పోవడం ప్రజల ఓట్లతో గెలి చిన పాలకుల పనితనానికి నిదర్శనం. కేవలం కమీషన్‌లు వచ్చే ప్రాంతాల్లో నిర్మించిన మురికి కాలువలను తొలగించి అక్కడే మరో మురికి కాలువలు నిర్మించారే తప్ప ఏండ్లుగా ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయా చోట్ల నూతన మురికి కాలు వలు నిర్మిద్దామనే కనీస ఆలోచనలు చేయలేదు. ఇక విద్యానగర్ కాలనీ, జీవదాన్ ఆసుపత్రి నుంచి మొదలుకొని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా వరద నీరు సరిగ్గా ప్రవహించక ప్రతీ యేటా వర్షపు నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు అనేక చోట్ల ముంపు ప్రాంతాలు ఉన్న అధికారులు వరద వచ్చిన సమయంలోవచ్చి ఫోటోకు ఫోజులు ఇచ్చి త్వరలోనే సమస్యలు తీరుస్తామని చెప్పి వెళ్తున్నారే తప్ప ప్రజలకు వరద నీటిపై సరైన పరిష్కారం చూపడం లేదు. వాస్తవానికి ఎండ కాలంలోనే గత అనుభవలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాల్సి ఉన్న అధికారులు కదలకపోవడంతో ఈ సంవత్సరం ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికైనా అధికారులు కదిలి భారీ వరద కాలువలోని పూడిక తీత, ఆ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ముంపునకు గురవుతున్న ప్రాం తాల్లోని సమస్యలపై దృష్టిసారించి కనీసం తాత్కలిక పరిష్కారాలను చూపితే ప్రజలకు ఎంతోకొంత వరద ముప్పు నుంచి ఇబ్బందులు తప్పే అవకాశం ఉంటుంది.

చిన్నారుల చిరుతిళ్లపై

కమ్ముతున్న విషం

● జిల్లాలో జోరుగా నకిలీ బ్రాండ్ పేరిట విక్రయాలు ● చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా
● రంగురంగుల కలర్ ప్యాకెట్లు రూ.5కే ● తనిఖీలు చేపట్టని ఆహార నియంత్రణ అధికారులు



రంగు రంగుల ప్యాకెట్‌లలో విక్రయిస్తున్న చిరు తిళ్లు

బోధన్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల చిరుతిళ్లపై కమ్ముతున్న విషం నిజమే అనిపిస్తుంది. 5 రూపాయల రంగురంగుల కలర్స్ ప్యాకెట్‌లలో కూరుకూరే, ఆలు చిప్స్, లేస్, బొంగులు, ఇతరత్రా చిరుతిళ్ల పేరిట చిన్నారుల చిరుతిళ్లపై విషం కమ్ముతుంది. చిన్నారులే లక్ష్యంగా అక్రమార్కుల దందా కొనసాగుతుంది. నకిలీ బ్రాండ్‌ల పేరిట జోరుగా విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ రంగురంగుల ప్యాకెట్ల చిరుతిళ్ల వల్ల చిన్నారులు అపెండెక్స్ బారిన పడుతున్నారు. ఇంత జరిగినప్పటికి ఆహార నియంత్రణ అధికారులు తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. నాణ్యత లేని ఆహార పదార్థాలను చిరుతిళ్లను అక్రమదారులు జోరుగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు తినే తిండ్లపై అసలు బ్రాండ్ లేకుండానే అందమైన ప్యాకింగ్‌లను రూపొందిస్తూ చిన్నారులు ఆకర్షిలయ్యే విధంగా తయారు చేస్తున్నారు. ఆకట్టుకునే బొమ్మలు రంగురంగుల ప్యాకింగ్‌లతో చిన్నారుల చిరుతిళ్లను విక్రయిస్తున్నారు. చిన్నారుల అల్లరిని మానిపించేందుకు తల్లిదండ్రులు ఏమి చేయలేక కొనివ్వడం తప్పడం లేకపోయింది. ప్రతి రోజు జిల్లాలో చిరుతిళ్లపై కోట్ల రూపాయల దందా కొనసాగుతుంది. నకిలీ బ్రాండ్‌ల పేరిట చిరుతిళ్లపై వైద్యులు చిన్నారులను తినవద్దంటూ వైద్య సలహాలు ఇస్తున్న ఎక్కడ మాత్రం ప్రభావం కనిపించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. తక్కువ ధర పేరిట వ్యాపారాన్ని మార్కెట్‌లో ప్రారంభించి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. చిరుతిళ్లపై ఉభయ జిల్లాతో పాటు బోధన్ డివిజన్‌లో ఆహార నియంత్రణ అధికారులు కన్నెత్తి చూడకపోవడం ఒక వైపు తనిఖీలు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు తలెత్తుతున్నాయి.

● తక్కువ ధరలో ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లు

మార్కెట్‌లో చాలా వరకు చిన్నారులకు సంబంధించిన తిను బండరాలు తక్కువ ధరకే లభిస్తాయి, చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా రంగు రంగుల ప్యాకింగ్‌లు చేపడుతున్నారు. ఒక్క రూపాయల నుండి 50రూపాయల వరకు రకరకాల సైజ్‌లు, వివిధ రుచులు, ఫ్లేవర్‌లను చూసి ఖరీదైన వస్తువు మాదిరిగానే కనిపిస్తున్న వాటి ధర మాత్రం తక్కువనే. దీంతో చిన్నారులు వాటిని కొనేందుకు మారం చేస్తూ కొనేంత వరకు విడిచి పెట్టలేని విధంగా ఆకర్షితులను చేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్‌లో ఎక్కువగా క్రేజ్ ఉండే వాటి పేర్లను మాత్రమే చిరుతిళ్లకు మార్చడంతో పిల్లలు మరింత ఆసక్తిని పెంచుకుంటున్నారు. ఇలాంటి చిన్నచిన్న వాటితోనే లక్షల రూపాయల దందా కొనసాగుతుంది.

● పిల్లల ఆరోగ్యంపై పట్టించుకోని ఆహార నియంత్రణ అధికారులు

ఇలాంటి రంగురంగుల ప్యాకెట్లలో ఉన్న రకరకాల చిరుతిళ్లను చిన్నారులకు విక్రయించడంతో చిన్నారులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా వీటి వల్ల చిన్నారులకు అపెండెక్స్ బారిన పడుతున్నారు. వైద్యులు ఎంత చెప్పిన తల్లిదండ్రులు సముదాయించిన పిల్లలకు మారంకు భయపడి కొనివ్వక తప్పని పరిస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోకపోవడంతోనే చిన్నారులు అనారోగ్యం కారణంగా ఆసుపత్రుల పాలవుతున్నారు. జోరుగా నకిలీ చిరుతిళ్ల విక్రయాలు కొనసాగుతున్న చిన్నారులకు ప్రమాదం అని తెలిసిన ఆహార నియంత్రణ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్నారుల చిరు బండారాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన ఆహార నియంత్రణ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి..

● నాసిరకం పదార్థాలు తింటే చిన్నారులకు ప్రమాదకరం

డాక్టర్ రాహుల్ కుమార్, సూపరింటెండెంట్, సివిల్ సర్జన్



మార్కెట్‌లో నాసిరకం తినుబండారాలు చాలా వరకు లభిస్తున్నాయి. రంగురంగుల ప్యాకెట్‌లలో ఉండడంతో చిన్న పిల్లలు ఆకర్షితులై చిరుతిళ్లపై ఎక్కువగా మోజు చూపుతున్నారు. ఎక్కువకాలం నిల్వ ఉండి వివిధ రసాయనాలతో ప్రమాదకరంగా ఉన్న తినుబండరాలను తింటూ పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. పిల్లలు తరుచు అపెండెక్స్‌కు గురవుతున్నారు. నాణ్యత లేని చిరు తిళ్ల పట్ల చిన్నారులు దూరంగా ఉండడం చాలా మంచిది.

మళ్లీ మొదలైన లంపీ స్కిన్ వైరస్

● రోజు రోజుకు పశువులకు విస్తరిస్తున్న వ్యాధి ● జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో పశువులకు లక్షణాలు ● పశుసంవర్ధక శాఖ అధికారులు దృష్టి సారించేనా..?!







కామారెడ్డి పట్టణంలోని రామాలయం వద్ద ఉన్న లంపీ స్కిన్ వైరస్ సోకిన పశువులు

కామారెడ్డిటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో లంపీ స్కిన్ భారిన పడుతున్న పశువుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుంది. గతంలో పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు పశువులకు టీకాలు వేసినప్పటికి వాటి యాజమానులు సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ఒకదాని నుంచి మరోకదానికి మళ్లి వైరస్ సోకుతుంది.అయితే కొందరు పశువులను పెంచుకుంటుండడంతో ఆ పశువులతో కలిసి వైరస్ సోకిన పశువులు సైతం తిరుగుతున్నాయని యాజమానులు పేర్కోంటున్నారు.

విజృంభిస్తున్న లంపీ స్కిన్ వైరస్

లంపివైరస్ ఎక్కువగా దోమలు, ఈగల ద్వారా ఆవులు, ఎద్దులు,బర్రెలకు సోకుతుంది. లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువుల శరీరంపై గుండ్రటి దద్దులు ఏర్పడతాయి. చివరకు గగోడులు వాపు,జ్వరం,కాళ్లవాపులు వస్తాయి. కండ్లనుంచి నీరు కారుతుంది. దీనితో పాటు సరిగ్గా మేత మేయని పశుసంవర్ధక అధికారులు పేర్కోంటున్నారు. ప్రస్తుతం వైరస్ సోకిన పశువులు ఈ లక్షణాలతో కనిపిస్తుండడం గమనార్హం. వైరస్ భారిన పడిన పశువులు రోడ్లపై వేసిన చెత్తచెదారాన్ని తింటుండడం వాటిపై ఉన్న దోమలు, ఈగల వల్ల పశువులకు వైరస్ సోకుతుందని తెలుస్తుంది. ముఖ్యంగా కామారెడ్డి పట్టణంలోని రామాలయం, గాంధిగంజ్, సిరిసిల్లరోడ్డు, అంగడి బజార్, అయ్యప్ప ఆలయంతో పాటు ప్రధాన ఆలయాల వద్ద ఎక్కువగా గుంపులుగుంపులుగా రాత్రి వేళలో సేదతీరుతున్నాయి.పట్టణంలోని అన్ని వార్డులలో నిత్యం ఇండ్ల వద్ద పెట్టి పాచిపోయిన అన్నం,బియ్యం,కుళ్లిన పండ్లు, చెత్తచెదారం తిని తిరిగి ఒకే దగ్గరకు వచ్చి సేదతీరడంతో ఒక్క పశువుకు వైరస్ సోకిన అన్నింటికి వ్యాధి వ్యాప్తిచెందుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

● పశువుల్లో లంపిస్కిన్‌వ్యాధి మళ్లి కనిపిస్తుంది.

- పిట్ల వేణు, మాజీ కౌన్సిలర్,కామారెడ్డి

మా వార్డు పరిధిలోని రామాలయం వద్ద పదులసంఖ్యలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకింది.గతంలో ఒకటి,రెండు పశువులకు లంపిస్కిన్ లక్షణాలు ఉండగా ఇప్పుడు పదులసంఖ్యలో పశువులకు లక్షణాలు కనిపిస్తున్నాయి. పశుసంవర్ధక,మున్సిపల్ అధికారులు స్పందించి వ్యాధి తీవ్రత పెరుగకముందే తగిన చర్యలు తీసుకోవాలి.

నేడు యాద్గార్‌పూర్‌లో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన

కోటగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో సోమవారం గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు రోజుల నుంచి గ్రామంలో దేవత విగ్రహాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల అందజేత

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తెలంగాణ మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ హాజరై విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపు విద్యార్థులు చదువులో ముందుండి వివిధ రంగాలలో దేశానికే కాకుండా మున్నూరుకాపు కులానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధికంగా 586 మార్కులు సాధించిన విద్యార్థినితో పాటు ఇంటర్‌లో 994 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. మొత్తం 115 మంది విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోటరాజశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ పటేల్, నాయకులు ధర్మపురి సురేందర్, నరాల రత్నాకర్, రవి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

మోపాల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ 2000-2001 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పుడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రాణేశ్వర్, పోతన్న, సత్యనారాయణరెడ్డి, వినాయక్, మల్లయ్య, వేణుగోపాలస్వామి, శోభ పాల్గొన్నారు. అప్పటి విద్యార్థులు సంతోష్‌రెడ్డి, నరేష్, సాయిరాం, ప్రవీణ్, శ్రీధర్, సంజీవ్‌గౌడ్, సుమలత, ఊర్మిళ, యాస్మిన్, సువర్ణ, భాగ్యలక్ష్మి, సుహాసిని, మహేష్‌రెడ్డి, చక్రపాణి, అనురాధ, కవిత, పాల్గొన్నారు.

నల్లవెల్లిలో..



ఉపాధ్యాయులతో పదోతరగతి పూర్వవిద్యార్థులు

ఇందల్వాయి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2009-10 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. ఆత్మీయ సమ్మేళనంలో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 15 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాడు విద్య నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి ప్రతి గురువును గుండెల్లో పెట్టుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించి మెమోంటోను అందజేశారు.

మూడు నెలల రేషన్ పంపిణీ ప్రారంభం



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్పల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 13వేలకు పైగా రేషన్ కార్డులు ఉండగా కార్డు సభ్యులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున మూడు నెలలకు సంబంధించి బియ్యాన్ని పంపిణీ చేశారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ షాపులకు ఇప్పటికే బియ్యాన్ని సరఫరా చేశారు. రేషన్ షాపుల నుంచి ఆదివారం బియ్యాన్ని పంపిణీ చేశారు.

క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా రామకృష్ణ

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ క్రమ శిక్షణ కమిటీ సభ్యుడిగా నగరానికి చెందిన జీవీ రామకృష్ణ ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవితో పాటు ఇతర సభ్యులతో కలిసి ఆయన ప్రమాణస్వీకారం చేశారు. 30 ఏళ్లుగా పార్టీలో రామకృష్ణ పనిచేస్తూ మహేష్‌కుమార్‌గౌడ్‌కు అత్యంత సన్నిహితుడిగా రామకృష్ణ ఉన్నారు. తనకు క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నియమించడం మరింత బాధ్యతను పెంచిందని క్రమశిక్షణ గల కార్యకర్తగా సేవ చేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నర్సింగ్‌పల్లి గ్రామ కమిటీ ఏకగ్రీవం

మోపాల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక జరిగింది. అందరి సహకారంతోనే గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని వీడీసీ పెద్దలు పేర్కొన్నారు. అధ్యక్షులుగా విఠల్, ఉపాధ్యక్షులు ఎండీ ఫారుఖ్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, క్యాషియర్ సాయిలు, సెక్రెటరీ రాములు, సలహాదారులు ఎండీ అనీస్, కె.శ్రీనివాస్, బాబు, మల్లయ్య, శేఖర్, నరేష్, సాయిలు, అంబలాల్, నరహరి, గంగాధర్‌గౌడ్, రాములు ఎన్నికయ్యారు.

4న శంభులింగేశ్వర ఆలయంలో వేలం

నిజామాబాద్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శంభులింగేశ్వర ఆలయ లడ్డూ, పులిహోర ప్రసాదాల వేలంపాటను ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11గంటలకు వేలంపాట ఉంటుందని అర్హులైన వారు వేలం పాటలో పాల్గొని ప్రసాదాల టెండర్‌ను దక్కించుకోవాలని సూచించారు.





● పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

- సిద్ధమైన పోలీసు పరేడ్ గ్రౌండ్
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- నేడు ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించనున్న ఈరవత్రి అనిల్



నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్ సిద్ధమైంది. సోమవారం నిర్వహించనున్న అవతరణ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 10గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అంతకుముందు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించనున్నారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో గౌరవవందనం స్వీకరణ, ప్రసంగం, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, స్టాల్స్ సందర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు పోలీసు పరేడ్ మైదానాన్ని అధికారులు సిద్ధం చేశారు. ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేశారు. అతిథులు, అధికారులు, అమరవీరుల కుటుంబాలు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక షామియానాలు వేశారు. ప్రజలు తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. అదేవిధంగా శకటాల తయారీతో పాటు స్టాల్స్‌కు ప్రత్యేకంగా షామియానాలు వేశారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన తాహెర్‌బిన్ హందాన్



మీనాక్షి నటరాజన్‌తో తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్‌లతో మీనాక్షి నటరాజన్ వరుసగా భేటీ అవుతు న్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పార్టీ ఇంచార్జిగా ఉన్న రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఆమెతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆమెతో చర్చించారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సైతం తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు తదితరులు కలిశారు.

బీసీ రాష్ట్ర స్థాయి సమావేశంలో జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కళింగ భవన్‌లో జరిగిన బీసీల విస్తృతస్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను జిల్లా బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణను స్వాగతిస్తూ కేంద్రం బీసీ కులగణనకు సుముకత వ్యక్తం చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, నాయకులు కరిపె రవీందర్, వినోద్, శంకర్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు బస్సు పునఃప్రారంభం

సిరికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా నిలిపివేయబడిన వేములవాడ డిపో ఆర్టీసీ బస్సును ఆదివారం సిరికొండలో ప్రారంభించారు. డిపో మేనేజర్ శ్రీనివాస్ పూజలు చేసి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ప్రభుత్వం నడిపించే ఆర్టీసీ బస్సును ఉపయోగించుకోవాలని కోరారు. వేములవాడ నుంచి రెండు సార్లు సిరికొండకు వస్తున్నందున ప్రయాణికులు బస్సును ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాలతో సిరికొండలో బాధిత కుటుంబాలకు ఆదివారం చెక్కులను పంపిణీ చేశారు. సభావత్ బూలి, ఎస్.నాగలక్ష్మి, దాసరి సునీత, బోడ తిరుమల, కె.సునీతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు దేగం సాయన్న, భాస్కర్‌రెడ్డి, కొండ గోదావరి, దువ్వూరి భాస్కర్‌రెడ్డి, రమేష్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు

నిజామాబాద్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మతోన్మాద వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన జిల్లా కార్యదర్శి రమేష్‌బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాలు మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేయాలని అన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ కులం, మతం, పార్టీ అవగాహన పైన పార్టీ నిర్మాణం కర్తవ్యాలు అనే అంశాలపై ఎప్పుడూ కార్యకర్తలు ఆలోచన చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో విద్వేశాలను రెచ్చగొట్టడానికి కులం, మతం ప్రాతిపదికన ప్రజల్లో అనైక్యత సృష్టిస్తున్నారని వీటిని వ్యతిరేకిస్తూ ప్రజాసమస్యలపై దృష్టికేంద్రీకరించే విధంగా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. నిజాం ఫ్యాక్టరీ పునరుద్ధరణతో పాటు పసుపు బోర్డు వల్ల రైతుల ప్రయోజనం మెరుగుపర్చడానికి దోహదపడే విధంగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, వెంకటేశ్, నూర్జహాన్, శంకర్‌గౌడ్, గంగాధర్, నన్నేసాబ్, గంగాధర్, సుజాత, సాయిలు, అనసూయ, అనిత, రాములు, నర్సయ్య, విశాల్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో అధ్యాపకురాలి మృతి

నిజామాబాద్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న స్వర్ణ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా డీఐఈవో కార్యాలయంలోని మూల్యాంకన కేంద్రంలో ఆమె చిత్రపటానికి డీఐఈవో రవికుమార్ తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, పలువురు ప్రిన్సిపాళ్లు పాల్గొని నివాళులర్పించారు.

ఇంక్రిమెంట్ ఇవ్వాలని నిరసన..

2023 మేలో రెగ్యులర్ అయిన అధ్యాపకుల రెండవ వార్షిక ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని ఆదివారం మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఐఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యపకుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గంగాధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

● ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎం.సాయరెడ్డి

జక్రాన్‌పల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో జక్రాన్‌పల్లి మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపేట్ గ్రామంలో 50లక్షల రూపాయలతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి సాయరెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాటాలపు సాయన్న, రాజేందర్, ముత్యంరెడ్డి, నర్సయ్య, పోశన్న, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లాలో రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు

(మూడో పేజీ తరువాయి)

భూసమస్యను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తారు. దరఖాస్తు చేసిన రైతులకు నోటీసు ఇవ్వడంతో పాటు వారితో కలిసి వారి భూములను పరిశీలిస్తారు. ఒకవేళ ఆ భూమికి సంబంధించిన సమస్య వారి పరిధిలో పరిష్కారం అయ్యే విధంగా ఉంటే తహసీల్దార్ పరిధిలోనే పూర్తి చేస్తారు. అక్కడ పరిష్కారం కాని భూములకు సంబంధించిన దరఖాస్తులను ఆర్‌డీవో పరిధికి పంపిస్తారు. అక్కడ పరిష్కారం కాకుంటే జిల్లా స్థాయిలో కలెక్టర్‌కు పంపిస్తారు. భూములపై ఉన్న సమస్యల ఆధారంగా మూడు చోట్ల మొత్తం భూసమస్యలను పరిష్కరించే విధంగా భూభారతి చట్టంలో వెసులుబాటును కల్పించారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఈ సమస్యలను పరిష్కరించనున్నారు. ధరణి వల్ల ఏర్పడిన భూసమస్యలకు సంబంధించి పరిష్కరించేందుకే ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో పూర్తిస్థాయిలో ఈ భూములకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో భూసమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 3 నుంచి 20 తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని మెండోరా మినహా మిగతా అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ఈ సదస్సులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మండల స్థాయి రెవెన్యూ అధికారులందరూ సదస్సులో పాల్గొనడంతో పాటు భూములకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు కసరత్తు

(మూడో పేజీ తరువాయి)

ఉన్న ఉపాధ్యాయుల సర్దుబాటు అవసరం లేదనుకుంటే అదే పరిధిలో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అక్కడ విద్యార్థుల సంఖ్య కంటే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటే మండల పరిధిలో ఆ తర్వాత పక్క మండలం పరిధిలో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గత ఏడాది జారీ చేసిన మార్గదర్శకాలతో పాటు ఈసారి కొత్త నిబంధనలను సర్దుబాటు ప్రక్రియలో చేర్చారు.

సర్దుబాటు చేస్తే ఉపాధ్యాయులు వెళ్లేనా..

గత ఏడాది జూన్, జూలై నెలల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించారు. డీఎస్సీ-2024 ద్వారా నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చారు. 460 మంది కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇచ్చినప్పటికీ ఇంకా సుమారు 500 వరకు ఖాళీలు ఉన్నాయి. కరోనా తర్వాత విద్యావలంటీర్ల పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. దీంతో ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నచోట ఇతర చోట్ల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. సర్దుబాటు అంశాన్ని కొంత మంది ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలలకు కేటాయింపులు చేసుకున్నారు. ఇప్పుడు విద్యాశాఖ మళ్లీ సర్దుబాటు ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండగా ఈసారి సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలలకు వెళ్తారా లేదా అనేది తేలాల్సి ఉంది.

వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు..

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈనెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్యక్రమం ముగిసిన తర్వాత చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని విద్యార్థుల సంఖ్యపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని, బడిబాట కార్యక్రమం ముగిసిన తర్వాతనే సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ముందస్తు సర్దుబాటు నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నా అందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి

● గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

ధర్పల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి వారిని పర్మినెంట్ ఉద్యోగులుగా చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణలో సఫాయి కార్మికుల పాత్ర కీలకం అని వారికి సన్మానాలు చేసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయడంలో తాత్సారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమస్యలపై సమ్మె చేస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం కాలయాపన చేసి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పంచాయతీకార్మికులను పర్మినెంట్ చేసే బాధ్యత తనదంటూ రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని ప్రభుత్వం రాగానే హామీలు తుంగలో తొక్కారని అన్నారు. 2016 అక్టోబర్ 26న సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చినా అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కార్మికులందరికి పీఎఫ్ సౌకర్యం, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలయ్య, గ్రామ పంచాయతీ కార్మిక నాయకులు గంగన్న, శంకర్, సంజీవ్ పాల్గొన్నారు.



ధర్పల్లిలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా బోనాల ఊరేగింపు

ధర్పల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోగల గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సకాలంలో వర్షాలు కురవాలని వ్యాధులు ప్రబలకుండా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రతియేటా గ్రామదేవతలకు పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గంగరాజం, వైస్‌చైర్మన్ సాయిలు, క్యాషియర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండలంలోని గౌరారం, ఎల్లారెడ్డిపల్లి, తిర్మన్‌పల్లి, ఇందల్వాయి, గన్నారం, తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామస్థులు పోచమ్మపండుగను ఘనంగా నిర్వహించారు. ఊర దేవతలకు మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగించి డప్పు వాయిద్యాలతో పోతరాజులు నృత్యాలు చేస్తూ ఆనందంగా జరుపుకున్నారు. గ్రామస్థులంతా సుఖసంతోషాలతో జీవించాలని గ్రామదేవతలకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సిరికొండ: వర్షాకాలంలో వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుతూ మండలంలో ప్రజలు పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాభివృద్ధి కమిటీల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో కులసంఘా ఆధ్వర్యంలో పోచమ్మ దేవతలకు బోనాలు ఎత్తి సమర్పించారు. డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ దగ్గరికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కొండాపూర్ గ్రామంలో పోచమ్మ పండుగ సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.